సాక్షి చిత్తూరు

శనివారం । 23 । డిసెంబర్ । 2023



కట్టెదుర 'వైకుంఠము'

వైకుంఠ ఏకాదశికి తిరుమల శోభాయమానం గా ముస్తాబైంది. ఉత్తర ద్వార దర్శనానికి భక్తజనం తరలివస్తోంది. - 8లో



మరింత వేగంగా ఓటరు నమోదు

జిల్లాలో యువ ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఎన్నికల అబ్జర్వర్ ఆదేశించారు. - 8లో



వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల సమయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఉపవాస దీక్షలతో మహిళలు పిండి, నూనె దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలో అన్నదానానికి పలమనేరుకు చెందిన సీఎస్ నవీన్‌కుమార్, మిత్రబృందం కూరగాయలు సమకూర్చారు.

వరసిద్ధుని దర్శనానికి 4 గంటలు



భక్తులతో నిండిన క్యూ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అయ్యప్ప మాలధారులతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలు నిండిపోయాయి. ఈ క్రమంలో గణనాథుని దర్శనానికి సుమారు 4 గంటల సమయం పడుతోంది. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు పాఠశాలలకు సెలవు లేదు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు శనివారం ఎలాంటి సెలవు లేదని, విధిగా పనిచేయాలని డీఈఓ విజయేంద్రరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు డీవైఈఓ, ఎంఈఓలు చర్యలు చేపట్టాల ఆదేశించారు. ఒక్క పాఠశాలకు కూడా లోకల్ సెలవు ప్రకటించకూడదన్నారు. అన్ని పాఠశాలల పరిధిలో తప్పనిసరిగా ఆడుదాం ఆంధ్రా ర్యాలీ నిర్వహించాలని సూచించారు.

'ఉమెన్ ఛేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్'గా దుర్గ



అవార్డు అందుకున్న దుర్గ

కుప్పం: ఐకాన్ ఆఫ్ ఆసియా సంస్థ ఏటా అందించే ఉమెన్ ఛేంజ్ మేకర్ ఆఫ్ ది అవార్డుకు 2023 సంవత్సరానికి ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ఎంపికయ్యారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకున్నారు. ,గ్రామీణ ప్రాంతాల్లో యోగం సంస్థ ద్వారా దుర్గ చేపట్టిన సేవలకు అవార్డు దక్కినట్లు నిర్వాహకులు తెలిపారు. విశిష్ట పురస్కారం అందుకున్న దుర్గకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ రెడ్డెప్ప అభినందనలు తెలిపారు.

సంతోషంగా క్రిస్మస్ సంబరాలు



సపోజ్ క్రిస్మస్ వేడుకలో విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: క్రిస్మస్ సంబరాలను క్రైస్తవ సోదరులు సంతోషంగా జరుపుకోవాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సపోజ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత గీతాలపాలనతో అలరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయానందరెడ్డి డాక్టర్లు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు లోక రక్షకుడని, ఆయన బోధనలను విధిగా పాటించాల్సిన అవసరముందన్నారు. అలాగే వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది ప్రజలకు రక్షణగా నిలవాలని సూచించారు. ప్రభుత్వ ఆశయం మేరకు వైద్య సేవలను అందించాలని కోరారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువ ద్వారా గంగవరం మండలంలో ప్రవహిస్తున్న కృష్ణాజలాలు (ఇన్‌సెట్) పుంగనూరు ఉపకాలువ నుంచి వస్తున్న నీరు





కృష్ణమ్మ పరవళ్లు

జిల్లాలోని పడమటి మండలాల ప్రజల స్వప్నం సాకారమైంది.. హంద్రీ-నీవా కాలువ జలకళ సంతరించుకుంది.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ పరుగులు తీస్తోంది.. పుంగనూరు నుంచి పలమనేరు దాటి కుప్పం దిశగా ఉరుకుతోంది.. కరువు నేల ఇకపై సస్యశ్యామలం కానుంది.. తాగునీటి కష్టాలకు సైతం చెక్ పడనుంది.. దశాబ్దాల ఆకాంక్ష నెరవేరిన క్రమంలో రైతాంగం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది.. మాట చెల్లించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తోంది.. గతంలో చంద్రబాబు జలహారతి పేరిట మోసం చేశారని మండిపడుతోంది.. సాగును సంబరంగా మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తోంది.

- పలమనేరుకు చేరిన హంద్రీ-నీవా జలాలు
- మరో 20 రోజుల్లో కుప్పం చేరనున్న నీరు
- ఆనందోత్సాహాల్లో పడమటి మండలాల ప్రజలు
- ఇచ్చిన మాట నెరవేర్చిన ముఖ్యమంత్రిపై ప్రశంసలు
- గతంలో జలహారతి పేరిట మోసం చేసిన చంద్రబాబు
- సొంత నియోజకవర్గానికి సైతం మొండిచేయి
- నీరిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్న రైతులు

పలమనేరు/ బైరెడ్డిపల్లి : జిల్లాలోని పడమటి ప్రాంతమైన కుప్పం, పలమనేరు ప్రజల దశాబ్దాల కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారచేసింది. హంద్రీ-నీవా పుంగనూరు ఉప కాలువ నుంచి కుప్పం ఉపకాలువకు మూడు రోజులుగా నీరు ప్రవహిస్తోంది. ప్రస్తుతం పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం మండలాలను దాటి కృష్ణా జలాలు బైరెడ్డిపల్లె మండలంలోకి చేయారి. మరో ఇరవై రోజుల్లో కుప్పం నియోజకవర్గంలోని పరమ సముద్రానికి చేరుకోనున్నాయి. ఈ క్రమంలో పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. హంద్రీ-నీవా కాలువలో బిరబిరా వస్తున్న కృష్ణా జలాలను చూసి రైతులు పులకరిస్తున్నారు. కరువు ప్రాంతంగా పేరుపొందిన పడమటి మండలాలు ఇకపై సస్యశ్యామలమవుతాయని సంతోషంగా చెబుతున్నారు. వ్యవసాయ బోర్లలో సైతం భూగర్భజలాలు పెరిగుతున్నాయని వెల్లడిస్తున్నారు.

కుప్పం ఉప కాలువ లక్ష్యం ఇదీ..

హంద్రీ-నీవా సుజల స్రవంతిలో భాగంగా రాయలసీమలోని 6,025 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీటిని అందించడమే ఈ పథకం లక్ష్యం . ఇందుకోసం కృష్ణా నదినుంచి 120 టీఎంసీల నీటిని ఇక్కడికి తరలించే పథకం ఇది. అందులో భాగమే కుప్పం, పుంగనూరు ఉప కాలువలు. పుంగనూరు ఉపకాలువ నుంచి 143.9 కిలోమీటర్ల మేర కుప్పం ఉపకాలువ ద్వారా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాలకు 4.02 లక్షల మంది దాహార్తిని తీరుస్తారు. 110 చెరువులను ఈ నీటితో నింపి సుమారు 6,300 ఎకరాలకు సాగునీరు అందిస్తారు. గతంలో రూ.460.81 కోట్లతో ఆర్‌కే హెచ్‌ఈఎస్ కోయ అనే సంస్థ పనులు ప్రారంభించింది. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పనుల అంచనాను రూ.560.29 కోట్లకు పెంచింది. దీంతో కుప్పం ఉపకాలువ పనులు రూ.99.4 కోట్లతో ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టింది. ప్రస్తుతం రూ.65 కోట్ల దాకా పనులు పూర్తి చేసింది. ప్రస్తుతం కృష్ణా జలాలు బైరెడ్డిపల్లె మండలంలోని మిట్టపల్లెకు చేరుకున్నట్టు హంద్రీ-నీవా ఎస్‌ఈ సీఆర్ రాజగోపాల్, ఈఈ డి.రమేష్‌బాబు తెలిపారు.

వడివడిగా కుప్పానికి!

బైరెడ్డిపల్లి మండలంలోని తీర్థం, తోటకనుమ, కృష్ణాపురం, రామకుప్పం మండలాల మీదుగా కృష్ణా జలాలు వడివడిగా ప్రవహిస్తున్నాయి. మరో ఇరవై రోజుల్లో కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం చెరువుకు చేరుకోనునున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. హంద్రీ-నీవా జలాల రాకతో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పనున్నాయి. పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లె, కుప్పం మండలాల్లోని 6300 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు 0.5 టీఎంసీల సాగునీరు, 4.02 లక్షల మందికి 0.6టీఎంసీల తాగునీరు అందనుంది.

చంద్రబాబు చేసిన దగా ఇలా..

ఉమ్మడి జిల్లాలోని మదనపల్లెకు 2019లో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు వచ్చారు. అదే ఏడాది డిసెంబరు నాటికి హంద్రీ-నీవా కాలువ ద్వారా పలమనేరు, కుప్పానికి నీరందిస్తామని హామీ ఇచ్చారు. అప్పటికే 2014 నుంచి ఏటా డిసెంబర్‌కు నీళ్లిస్తామంటూ జనాన్ని నమ్మిస్తూనే వచ్చారు. అయితే 2019 ఎన్నికలు సమీపిస్తుండడంతో హంద్రీ-నీవా కాలువలకు దగ్గర్లోని చెక్‌డ్యామ్‌ల నుంచి బోర్ల ద్వారా నీటిని కాలువలోకి పంపింగ్ చేసి పలమనేరు దాకా తరలించారు. ఆ నీటికే జలహారతి పేరిట అట్టహాసంగా పూజలు చేసి కుప్పం వాసులకు కుచ్చుటోపీ పెట్టారు. కేవలం నాలుగురోజులకే కాలువలో నీరు కనిపించకపోవడంతో జనం నోరెళ్లబెట్టారు. ఇదెక్కడ మోసమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగు మోటార్లతో..

హంద్రీ-నీవా పథకంలో భాగంగా గంగవరం మండలంలోని పశపత్తూరు, వి.కోట మండలంలోని కృష్ణాపురం, రామకుప్పం మండలంలోని ఆదినేపల్లి వద్ద పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పశపత్తూరు వద్ద 750 కిలోవాట్స్ సామర్థ్యంగల నాలుగు మోటార్లతో నీటిని పైప్రాంతంలోని కాలువకు పంపింగ్ చేస్తున్నారు. ఇందుకోసం గంటకు 5,400 క్యూసెక్‌మీటర్ల నీటిని పంపే 5వేల కేవీ మోటార్లను అమర్చారు. అలాగే నీరు వేగంగా వెళ్లేందుకు భారీ కంప్రెషర్లు ఏర్పాటు చేశారు.

ఇచ్చిన మాట మేరకు..

గత ఏడాది కుప్పం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023 డిసెంబరు నాటికి హంద్రీ-నీవా కాలువ ద్వారా పలమనేరు, కుప్పానికి నీరందిస్తామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు హంద్రీ-నీవాలో ఇప్పుడు కృష్ణమ్మ పరవళ్లుతొక్కుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు సంబరపడుతున్నారు. తమ పాలిట అపర భగీరథుడంటూ కొనియాడుతున్నారు.



పశుపత్తూరు పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన భారీ మోటార్లు



బైరెడ్డిపల్లి మండలంలో మిట్టపల్లె వద్ద ఉప కాలువలో జలాలు

ఇది చేతల ప్రభుత్వం



కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం జనాన్ని ఏమార్చేందుకు ఇది మాటలు చెప్పే టీడీపీ ప్రభుత్వం కాదు. మాట ఇస్తే కచ్చితంగా నెరవేర్చే చేతల ప్రభుత్వం ఇది. చేసేది గోరంత అయితే కొండంత ప్రచారం చేసుకోవడం చంద్రబాబు నైజం. అయితే అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని మేలు చేయడం ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజం. - శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్, చిత్తూరు

జగనన్నకు కృతజ్ఞతలు



గత టీడీపీ పాలనలో చంద్రబాబు చాలాసార్లు హంద్రీ-నీవా నీరొస్తుందంటూ ప్రజలను ఏమార్చారు. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. పలమనేరు నియోజకవర్గానికి హంద్రీ-నీవా వరప్రసాదినిలా మారుతుంది. భవిష్యత్‌లో ఈ ప్రాంతానికి తాగు, సాగునీటి సమస్యలు రావు. ప్రజా సంక్షేమమే పరమావధిగా శ్రమించే జగనన్నకు కృతజ్ఞతలు.

- వెంకటేగౌడ, ఎమ్మెల్యే, పలమనేరు

కల నెరవేరినట్టే..



కుప్పం ఓటర్లను మభ్యపెడుతూ అదిగో ఇదిగో హంద్రీ-నీవా అంటూ గతంలో చంద్రబాబు ఇక్కడి ప్రజలకు మోసం చేశారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఈ పనులను ఎందుకు చేయలేదో ఆయన సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కుప్పానికి గత ఏడాది వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అప్పుడు ఇచ్చిన హామీని నిలుపుకున్నారు. త్వరలో కుప్పానికి కృష్ణమ్మ రానుంది. దీంతో కుప్పం ప్రజల కల నెరవేరినట్టే. - భరత్, ఎమ్మెల్సీ, కుప్పం



టీడీపీ హయాంలో ఆగిన హంద్రీ-నీవా పనులు



పైపుల ద్వారా వస్తున్న నీరు



పశుపత్తూరు పంప్‌హౌస్ వద్ద నీరు

నీటి కొరత తీరినట్టే



హంద్రీ-నీవా కాలువలో నీరు రావడంతో తాగు, సాగు నీటి కొరత తీరినట్టే. గతంలో బోర్లు వేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వ్యవసాయం చేయడానికి సాహసం చేయలేక పొట్టకూటి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో మళ్లీ వ్యవసాయం మొదలుపెడతాం. - రెడ్డెప్పరెడ్డి, రైతు, పసపత్తూరు, గంగవరం మండలం

పొలం పోయినా పర్వాలేదు



నాకు మూడెకరాలు ఉన్నాయి. మా పొలం మధ్యలోనే హంద్రీ-నీవా కాలువ వచ్చింది. పొలం పోయినా పర్వాలేదు కానీ, మాకు సాగునీటి ఇక్కట్లు తప్పాయి. ఈ కాలువ ద్వారా వేసవిలో కూడా నీటి కొరత ఉండదు. భూగర్భజలాలు పెరుగుతాయి. రైతుల బాధలు తీరుతాయి. - శ్రీనివాసులు, రైతు, గుండుగల్లు, గంగవరం మండలం

బీడు భూములు సాగులోకి



నాకు రెండెకరాల పొలం ఉంది. అందులో ఇప్పటి వరకు మూడు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని హంద్రీ-నీవా కాలువలో కృష్ణా జలాలు వస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగి మా బోరులో కూడా నీరు వస్తోంది. ఇప్పుడు బీడు భూములు కూడా సాగులోకి వస్తాయి. - వెంకటరమణ, రైతు, బొమ్మరాజుపల్లె, గంగవరం మండలం

మేలు మరువలేం



వ్యవసాయాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. గతంలో అప్పుడప్పుడు వర్షాలు వస్తుండేవి. చాలీచాలని పంటలు సాగు చేస్తుండేవాళ్లం. బోర్లు వేసినా ఫలితం ఉండేది కాదు. ఇప్పుడు కృష్ణాజలాలు రావడంతో మాకు ఇకపై ఇబ్బందులు ఉండవు. కరువు సీమను తడుపులున్న జగనన్న మేలు మరువలేం. - అంజప్పగౌడ్, రైతు, రామసపల్లె, బైరెడ్డిపల్లి మండలం

ఆనందంగా ఉంది



ఇన్నాళ్లకు మా గ్రామం వద్ద కృష్ణానీటిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కరువు ప్రాంతంలో ఈ కాలువ ద్వారా ఎంత మేలు జరుగుతుందో మాకు తెలుసు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. - కేశవులు, రైతు, తీర్థం, బైరెడ్డిపల్లి మండలం

సుపరిపాలనతో సువర్ణకాలం

- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో మంత్రి రోజా



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న మంత్రి రోజా



విజయపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతో విద్యార్థులకు సువర్ణకాలం నడుస్తోందని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శుక్రవారం తడుకుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, విజయపురం జెడ్పీ హైస్కూల్‌లో 213 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరికీ సమాజంలో గౌరవం ఇస్తుంద, విద్యాలయాలకే గౌరవం తీసుకువచ్చిన నాయకుడు జగనన్న అని కొనియాడారు. చంద్రబాబు పేద పిల్లలకు చదువును గాలికి వదిలేస్తే, జగనన్న నాణ్యమైన విద్యను అందిస్తూ పోటీ ప్రపంచాలో దీటుగా రాణించేలా తీర్చిదిద్దుతున్నారని వెల్లడించారు. విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలను అమలు చేసేందుకు 55 నెలల్లో రూ.71వేల కోట్లు వెచ్చించారని వివరించారు. ఒక్క నగరి మండలానికే రూ.2.94 కోట్ల వ్యయంతో 891 ట్యాబ్‌లు పంపిణీ చేశారని చెప్పారు. అమ్మ ఒడితో ఆర్థిక సాయం, గోరుముద్దతో పౌష్టికాహారం, విద్యాకానుక కింద చదువుకు సంబంధించిన సామగ్రి, ఇంగ్లిష్ మీడియంలో బోధన, బైజూస్ ట్యాబ్‌లతో విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ముడిపల్లె రామాపురానికి చెందిన చంద్రసాయికృష్ణ అనే పేద విద్యార్థి విదేశాల్లో చదువుకునేందుకు ప్రభుత్వం రూ.55 లక్షలు మంజూరు చేసిందన్నారు. పిల్లలు చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధిస్తే అదే జగనన్నకు ఇచ్చే కానుకని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంఈఓలు శ్రీదేవి, ఆంజనేయులు, నమశ్శివాయం, జెడ్పీటీసీ సభ్యుడు గాంధీ, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఆర్‌బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, జబమేరి, రాజగోపాల్, గోపీనాథ్, రవినాయుడు, హరినాయుడు పాల్గొన్నారు.

వేడుకగా ముందస్తు క్రిస్మస్

పట్టణంలోని నెత్తం కండ్రిగ దళితవాడ పాఠశాలలో విద్యార్థుల నడుమ మంత్రి ఆర్‌కే రోజా ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఏరియా ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి కార్యక్రమంలో ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పిల్లలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతతో సామాజిక తనిఖీ

కార్వేటినగరం : సామాజిక తనిఖీని సిబ్బంది నిబద్ధతతో చేపట్టాలని పీడీ గంగాభవానీ స్పష్టం చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సామాజిక తనిఖీలో భాగంగా క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి అవకతవకలను గుర్తించాలని సూచించారు. ఉపాధి పనుల కింద మండలంలో మొత్తం 1,352 పనులకు గాను రూ. 9కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. అందులో మొక్కలు నాటేందుకు, భవన నిర్మాణానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.92 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉపాధి పనుల్లో గుర్తించిన అవకతవకలకు సంబంధించి రూ.6,972 రికవరీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీడీ శోభన్‌బాబు, ఎంపీపీ లత, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఓ జాహ్నవి పాల్గొన్నారు.

ఘనంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని లిటిల్ ఫ్లవర్ ఎయిడెడ్ పాఠశాలలో జిల్లా స్థాయి సదరన్ ఇండియా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. పోటీలకు జిల్లావ్యాప్తంగా మొత్తం 96 ఎగ్జిబిట్లు వచ్చాయి. ఈ సందర్భంగా డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సైన్స్ ప్రయోగాలపై పిల్లలకు ఆసక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా ప్రయత్నించినప్పుడే శాస్త్ర సాంకేతిక ఫలాలు సమాజానికి అందుతాయన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ మాట్లాడుతూ సర్కారు బడుల్లో సైన్స్ ల్యాబ్‌ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఎంఈఓలు, సెల్వరాజ్, మోహన్, సమగ్రశిక్ష సెక్టోరల్ ఆఫీసర్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌జీసీ కో-ఆర్డినేటర్ చైతన్య, హెచ్‌ఎంలు సురేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రగ్స్‌రహిత సమాజంలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కరస్పాండెంట్ వెంకట్‌నాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కరుణ కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌తో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకుడదన్నారు. డ్రగ్స్ విక్రయించడం , సరఫరా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు



అచ్చెన్నాయుడుకి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం రాత్రి పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రభాకర్ శాస్త్రి, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.



వైకుంఠ ద్వార దర్శనానికి ముస్తాబైన శ్రీవారి ఆలయం

కట్టెదుర వైకుంఠము

- తిరుమలలో శనివారం ఉదయత్పూర్వం నుంచి వైకుంఠ ద్వార దర్శనం
- తండోపతండాలుగా తరలివస్తున్న భక్తజనం
- మార్మోగుతున్న గోవిందనామస్మరణ

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినానికి తిరుమల ముస్తాబైంది. శనివారం ఉదయత్పూర్వం నుంచి వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కలగనుంది. ఈనెల 23 నుంచి వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం ఉంటుంది. ఈమేరకు టీటీడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. శ్రీవారి ఆలయంలో 2020కి ముందు వరకు వైకుంఠ ద్వారాన్ని రెండు రోజులపాటు తెరిచి ఉంచేవారు. ఆ తర్వాత నుంచి పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పించేలా టీటీడీ చర్యలు చేపట్టింది.



హరి నిలయంలో కరిరాజు రాజసం

వైకుంఠ ఏకాదశి ప్రాధాన్యత

వేంకటాచల మహత్యంలో దేవతలకు ఉత్తరాయణంలో వచ్చే 6 నెలల కాలాన్ని పగలుగా, దక్షిణాయణంలో వచ్చే 6 నెలల కాలాన్ని రాత్రిగా పేర్కొంటారు. దక్షిణాయణంలో చివరి నెల ధనుర్మాసాన్ని దేవతల నెలగా భావిస్తారు. అదే సమయంలో ముక్కోటి దేవతలు మహావిష్ణువుని దర్శించుకుంటారు. విష్ణువుకు తిథులలో ఏకాదశి, ద్వాదశి అతి ముఖ్యమైనవి. వైకుంఠ ఏకాదశి నుంచి వైష్ణవ ఆలయాలలో దేవతల ద్వారంగా పేర్కొనే ఉత్తర ద్వారాన్ని తెరచి ఉంచుతారు. ఆ రోజున విష్ణువు ఉత్తరద్వారం వద్ద దేవతలకు దర్శనమిస్తారని పురాణాల్లో పేర్కొన్నారు.

నేడు స్వర్ణరథోత్సవం

శనివారం తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశి, 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాలు జరగనున్నాయి. ఈ మేరకు శనివారం ఉదయాత్పూర్వం తిరుప్పావైతో శ్రీవారిని మేల్కొలిపి ఏకాంతంగా ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ జరగనుంది. రాత్రి రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవ కార్యక్రమాలు చేపడతారు. ఈ నెల 24న వైకుంఠ ద్వాదశి పర్వదినాన స్వామి పుష్కరిణి తీర్థముక్కోటి తిరుమలలో జరగనుంది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.



విరుల విందులో రంగనాథుడు!



శంఖు, చక్రాలు.. అన్నమాచార్యులు



భక్తజన గోవిందం

వెదురుకుప్పం రోడ్డుకు మోక్షం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న గ్రామస్తులు

వెదురుకుప్పం : ఏళ్ల తరబడి ఆధునికీకరణకు నోచుకోని వెదురుకుప్పం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించంది. కొద్దిపాటి వర్షానికే బురదగుంతను తలపించే ఈ మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణానికి అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో గ్రామానికి వచ్చిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి రహదారి కష్టాలను స్థానికులు తీసుకెళ్లారు. రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నట్లు వెల్లడించారు. దీనిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం త్వరితగతిని వెదురుకుప్పంలో సిమెంట్ రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఉపాధి నిధుల నుంచి రూ.9.40లక్షలను అధికారులు మంజూరు చేశారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రహదారి కష్టాలను తీరుస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్ప, మాజీ ఎంపీపీ జ్ఞానమ్మ, మాజీ సర్పంచ్ చిరంజీవిరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, స్థానిక నేతలు భాస్కర్ రెడ్డి, పురంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదుకుంటాం.. అండగా నిలుస్తాం!

- విద్యుదాఘాతంతో మృతి చెందిన విద్యార్థి
- బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన జెడ్పీ సీఈఓ



మృతుడి బంధువులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

యాదమరి : మండలంలోని కీనాటం పల్లెలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన అభి(18) అనే విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి భరోసా కల్పించారు. గురువారం సాయంత్రం కీనాటంపల్లె దళితవాడకు చెందిన ఇంటర్ విద్యార్థి అభి తమ పొలం వద్దకు వెళుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. దీనిపై మృతుడి బంధువులు శుక్రవారం ఉదయం స్థానిక సబ్‌స్టేషన్ ఎదట ధర్నాకు దిగారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ కన్నుమూశాడంటూ సాయంత్రం చిత్తూరు–గుడియాత్తం రహదారిపై రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, సీఐ రవిశంకర్ రెడ్డి అక్కడు వెళ్లారు. మృతుడి కుటుంబీకులు, బంధువులతో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షణ్మోహన్ దృష్టికి తీసుకెళ్లి రూ.5లక్షల పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల భరోసాతో మృతుడి బంధువుల ఆందోళన విరమించారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

చిత్తూరు అర్బన్: మైనర్ బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని పోక్సో న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కథనం మేరకు.. కేవీ పల్లె మండలం జిల్లేడు మంద గ్రామానికి చెందిన నాగార్జున నాయక్ తిరుపతి ఎమ్మార్‌పల్లెలో నివసిస్తూ టీటీడీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేసేవాడు. 2016లో ఇదే కాలనీకి చెందిన ఓ మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2016 ఆగస్టు 24నబాలికను అపహరించి ఆమెపై మళ్లీ లైంగిక దాడి చేశాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి నిందితుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. సాక్ష్యాధారాలను విచారించిన న్యాయమూర్తి శాంతి ఈ మేరకు నిందితుడికి జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాలిక కుటుంబానికి రూ.2లక్షలను పరిహారంగా మంజూరు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

శివశక్తి డెయిరీలోనే పాలకు అధిక ధర



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి

సదుం: హెరిటేజ్ కంటే శివశక్తి డైయిరీలోనే పాలకు అధిక ధర చెల్లిస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లాబాబు, బీసీవై పార్టీ నాయకుడు రామచంద్రయాదవ్ నిరాధార ఆరోపణలతో పాడి రైతులను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారానికి పాల్పడుతున్నట్లు మండిపడ్డారు. శివశక్తి డెయిరీ రూ. కనిష్టంగా రూ.34 వరకు చెల్లిస్తుండగా, హెరిటేజ్ రూ.27కు మించి ఇవ్వడం లేదని వెల్లడించారు. పాడిరైతులు దోచుకుంటున్న హెరిటేజ్ గురించి టీడీపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమన్నారు. అనవసరంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం గత మూడు నెలలుగా శివశక్తి, హెరిటేజ్ డైయిరీలో రైతులకు చెల్లిస్తున్న బిల్లుల వివరాలను మీడియాకు అందించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు మనోహర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, యాదవేంద్రరెడ్డి, గిరిధర్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ రమణ పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు విరిచేసిన అరటి చెట్లు చూపుతున్న మహిళా రైతు

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్లలో శుక్రవారం వేకువజామున పంటలపై ఏనుగులు దాడి చేశాయి. మంజు, మురళి, హరి, వెంకటేష్ అనే రైతులకు చెందిన అరటి, కొబ్బరి తోటలను ధ్వంసం చేశాయి. దెబ్బతిన్న పంటలను అటవీశాఖ బీట్ అధికారి ప్రతాప్ పరిశీలించారు. రైతులకు పరిహారం చెల్లించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఈ సందర్భంగా ఏనుగులను కట్టడి చేయాలని రైతులు కోరారు.

మరింత వేగంగా ఓటరు నమోదు



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ భాస్కర్, ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : నూతన ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతంగా చేయాలని జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. అబ్జర్వర్ మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీ వరకు నమోదైన అభ్యంతరాలను ఇంటింటికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 19,448 మంది యువ ఓటర్లను నమోదు చేయించారని చెప్పారు. బీఎల్‌ఓలు ప్రలోభాలకు లొంగకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎపిక్ కార్డులను పకడ్బందీగా పంపిణీ చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే ప్రతి అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ మేరకు జిల్లాలోని 7 నియోజక వర్గాల్లో మొత్తం 15,45,666 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 1,762 పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లను నియమించామని వెల్లడించారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డీఓలు చిన్నయ్య, సుజన, మనోజ్ కుమార్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ భవానీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు గంగరాజు, అట్లూరి శ్రీనివాసులు, జగదీశ్వరనాయుడు, లోకేష్, కోదండయ్య, లోకేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫారం 6,7,8,9లో మార్పులు, చేర్పులను జాగ్రతగా నిర్వహించాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను సరిచూసుకోవాలని ఆదేశించారు. నాడు–నేడు కింద ప్రాథమిక పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఈ విధంగా పాఠశాల ఉంటే విద్యార్థులకు సెలవు పెట్టాలనే ఆలోచన కూడా ఉండదని చమత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, డీటీలు మహేశ్వరి, మునికృష్ణ పాల్గొన్నారు.

వెరిఫికేషన్‌పై ఆరా

చిత్తూరు రూరల్ : కొత్త ఓటర్ల నమోదు ఎలా చేశారు?.. క్లెయిమ్స్ పరిష్కారం కోసం డోర్ టు డోర్ వెరిఫికేషన్ ఏలా చేశారు అంటూ జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆరా తీశారు. చిత్తూరులోని కట్టమంచి నగరపాలక పాఠశాలలో 18, 19 పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. దరఖాస్తులు సిద్ధం చేసిన విధానం, పరిష్కరించిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. బీఎల్‌ఓలు చక్కగా పనిచేశారని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ, ఆర్‌డీఓ చిన్నయ్య, సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపీ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టరేట్‌లో ఘనంగా క్రిస్మస్, హైటీ వేడుకలు
- పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, మేయర్ అముద, క్రిస్టియన్లు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, పక్కన డీఆర్‌ఓ రాజశేఖర్ తదితరులు



కేక్ కట్ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్రిస్టియన్లు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్, హైటీ కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్లతో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ కేక్ కట్ చేశారు. పాస్టర్లు ఇన్‌చార్జి కలెక్టర్‌కు కేక్ తినిపించగా, తదుపరి పాస్టర్లకు ఇన్‌చార్జి కలెక్టర్ కేక్ తినిపించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రేమ, దయ, గుణాలు ప్రజలందరికీ మార్గదర్శకమన్నారు. ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, అనురాగాలు, ప్రజల మనుగడ, జీవన శైలిని మార్చేశాయన్నారు. ప్రజల కోసం ఆయన ప్రాణ త్యాగం చేశారని, ప్రపంచ దేశాలన్నీ ఆయన్ని అనుకరిస్తున్నాయన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మానవుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా తోడ్పాటునందించాలని చెప్పారు. చర్చిలలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న వారికి అసైన్‌మెంట్ పట్టాలు అందజేస్తోందని తెలిపారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలోని ప్రజలంతా సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలన్నారు. ప్రేమ,త్యాగాలకు ప్రతీకగా ఏసుక్రీస్తు నిలిచారని అన్నారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ క్రిష్టియన్ సంస్థలు ఉచితంగా వైద్యం, విద్య, సామాజిక సేవలు చేస్తున్నాయని చెప్పారు. కుల,వర్గ బేధాలు లేకుండా క్రిస్టియన్‌లు కలిసిమెలిసి మెలగడం సంతోషకరమన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి మాట్లాడుతూ క్రిస్టియన్ల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అనంతరం క్యాండిల్స్ వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు ఒకరికొకరు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సంఘాల నాయకులు జోబ్, సైమన్‌సీజర్, జాస్వా, రమేష్‌ప్రసాద్,లత, రాబర్ట్, గని పలువురు పాస్టర్‌లు పాల్గొన్నారు.